# ఆటోగ్రాఫ్

**"పాలమ్మగారూ-"**

**అలారం కొట్టినట్టే పాలబ్బాయ్ పిలుస్తుంటే వెంటనే మెలుకువొచ్చేసింది. లేచి పాలు పోయించుకున్నాను.**

**శ్రీవారూ, ఇద్దరు పుత్రరత్నాలూ నిద్రలేవలేదు. అవున్మరి వాళ్ళకీరోజు ఆదివారం! సెలవురోజు!**

**నాకేమో ఆదివారమంటే అదనపు పనిభారం!**

**"ఆదివారంనాడు కాలేజి వుండదుగా- రాసిచ్చేయండి' అంటూ ఏ పేపర్‌వాళ్ళో, వీక్లీవాళ్ళో మరో ఎస్సయిన్‌మెంట్ ఇస్తే బుద్ధిగా ఒప్పేసుకుంటాను.**

'అమ్మా! ఎంచక్కా నువ్వీ ఆదివారం ఇంట్లోనే వుంటావ్‌కదా- తింటానికేం చేస్తావ్? చెక్కలా? కారప్పూసా? గవ్వలా?' అని పిల్లలు అడిగితే- మురిసిపోతూ 'మీకేం కావాల్రా' అనడుగుతాను.

"ఈ ఆదివారం ఓవర్‌హెడ్ ట్యాంక్ కడ గాలిరా' అంటారు శ్రీవారు. ఇద్దరం కల్సి కడుగుతాం కాబోలనుకుని సరే అంటాను. పని మొదలెట్టగానే ఏ ఫోను కాలో, ఏ ఫ్రెండో వస్తే శ్రీవారు శ్రీమహాలక్ష్మినీ, ఓవర్ హెడ్ ట్యాంక్‌నీ వదిలిపెట్టి శ్రీ మహావిష్ణువులా పరిగెత్తుతారు.

ఇక ఇల్లాలిగా నాకే అదనప్పన్లు సవాలక్ష కనబడ్తూ వుంటాయ్- నెయ్యి కాయటం దగ్గర్నుంచి పిల్లలకు నెయిల్స్ కట్ చేయటందాకా- నన్ను ముందు చూడవా అంటే నన్ను ముందు చూడు అంటూ వుంటుంది ప్రతి పని!

బ్రష్ చేసుకుంటూ, న్యూస్ పేపర్ హెడ్‌లైన్స్ చూసేసాను. అందరూ నిద్రలేస్తే నాకు పేపర్ దొరకదు.

స్ట్రాంగ్ కాఫీ తాగి, వెట్‌గ్రైండర్‌లో రాత్రి నానబెట్టిన పెసర్లని, పచ్చిమిర్చి, అల్లమ్ముక్కలు, వుప్పు వేసి గ్రైండ్‌చేసాను. అల్లం పచ్చడి చేసాను.

నాన్‌వెజ్ కర్రీలోకి మసాలా సిద్ధం చేసాను.

వుల్లిపాయలు తరిగాను.

ఇల్లూడ్చి, గిన్నెలు కడిగేసి వచ్చిన పని మనిషికి చాయ్ ఇచ్చాను.

లేపగా లేపగా శ్రీవారూ, పిల్లలూ లేచారు.

ఆ ముగ్గురూ టీవీ ముందు సెటిలవ్వకుండా "తొందరగా బ్రష్ చేసుకుని వచ్చేయండి- స్నానాలు, టిఫిన్లూ అన్నీ తొందరగా అయిపోవాలి! అమ్మకి ఇవ్వాళ చాలా పనుంది" అంటూ తరిమేను.

"ఇవాళేం టిఫిను" చిన్నాడు అడిగేడు.

"ఇవాళ సండే కదరా- పెసరట్లు" పెద్దాడు చెప్పాడు.

"అవునోయ్- వుప్మా కూడా ఆ చేత్తోనే చేసేయ్- వుప్మా, పెసరట్టు మంచి కాంబినేషన్" అదీ శ్రీవారి అభిరుచి!

నేను నవ్వుతూ 'సరే' అంటుండగా-

బొమ్మదేవర నాగకుమారి




"చేపలూ- చేపలూ" వీధిలోంచి అరుపు విన్పించింది.

"చికెన్ షాప్‌కెళ్ళి క్యూలో నించునే పని తప్పుతుంది చేపలు తీసుకోరాదోయ్" అన్నారాయన!

"అబ్బా! ఆ క్లీనింగ్- కడగడం- చాలా టైమ్ పడ్తుంది"

"మొగుడ్నీ, సమాజాన్నీ కడిగి పారేస్తుంటావ్ ఆఫ్ట్రాల్ చేపలు కడగడం నీకో పనా?" అంటూ జోకేసి శ్రీవారు చేపలబ్బాయ్‌ని పిలిచేసారు.

ఇంకా కదుల్తోన్న కొర్రమట్టల్ని చూసి పిల్లలు కూడా వుత్సాహపడటంతో చేపలు తీసుకొన్నాను.

"చేపల కళ్ళకి రెప్పలుండవంట- మా సైన్స్ మిస్ చెప్పింది" చిన్నోడికి పెద్దాడు చెబ్తున్నాడు.

"మరెట్లా నిద్రపోతాయ్ అన్నా" చిన్నోడి ధర్మ సందేహం!

"చాలా రోజులయ్యిందోయ్ చేపల పులుసు చేయకు- డీప్ ఫ్రయ్ చేయ్" తిండి విషయానికొచ్చేసరికి శ్రీవారికి నిర్దిష్టమైన అభిప్రాయాలు!

కోటి విద్యలు కూటి కొరకేగా- ఆ తిండిని ఎంజాయ్ చేయకపోతే ఇక బతుకెందుకూ అంటారు. 'బరువు పెరుగుతున్నారు. తిండి తగ్గించండి' అని అప్పుడప్పుడు దెబ్బలాడ్తుంటాను.

మళ్ళీ నాకే జాలివేస్తుంది- హైకేలరీ- లోకేలరీ- కొలెస్ట్రాల్, ఒబేసిటీ ఆరోగ్య సమస్యలు ఎందుకొచ్చిన విజ్ఞానం హాయిగా మొగుడికి ఇష్టమైనవి వండి పెట్టి కొసరికొసరి తిన్పించాల్సిందిపోయి- ఎందుకిలా పోరుపెడ్తాను అని నన్ను నేనే తిట్టుకుంటూ వుంటాను.

నాన్నగారికి అలా వండిపెట్టిన అమ్మ- నా అయిడియల్ వుమన్! నాన్నగారి జీవన విధానమే వేరు- వుదయాన్నే లేచేవారు-యోగా చేసేవారు. రెండు కిలోమీటర్ల దూరానున్న స్కూల్‌కి సైకిల్‌మీదే వెళ్ళేవారు. మార్కెట్‌కి, సెలూన్‌కి, రేషన్ షాపుకి- అన్నిటికీ సైకిల్‌మీదే వెళ్ళేవారు!

కానీ శ్రీవారు? బైక్‌మీద నుంచి కాలు తీస్తే బిల్డింగ్‌లోకి- బిల్డింగ్‌లోంచి కాలు తీస్తే బైక్ మీదకి! శారీరకపరమైన శ్రమ లేనేలేదు. వెళ్ళి ఏసీ గదుల్లో కూర్చుని పని చేయటం-

డైనింగ్ టేబుల్ దగ్గరికి శ్రీవారూ, పిల్లలూ చేరిపోవటంతో పెసరట్లు వేయటం మొదలుపెట్టాను.

నాలుగట్లు వేయటం పూర్తయ్యిందో లేదో ఫోను మోగింది. స్టవ్ సిమ్‌లో పెట్టి వెళ్ళి ఫోన్ తీసేను- ఎడం చేత్తో!

"హలో" అన్నాను.

"హలో! ఎవరు మాట్లాడ్తున్నారు?" ఆడ కంఠం ఫోన్‌చేసి వుదయాన్నే అందులో నేనింత పనిలో వుండగా- అలాటి ప్రశ్న అడగటంతో చిరాగ్గా అన్పించింది.

"మీరెవరు?" కొంచెం పదునుగా అడిగేను.

"నేను ముందడిగాను... ఎవరూ మాట్లాడేదీ అని"

"అరె! నా ఇంటికి ఫోన్‌చేసి ఎవరు మాట్లాడ్తున్నారూ అని నన్నడిగితే నేనెలా చెబ్తాను? అసలు మీకెవరు కావాలి? ఎవరి కోసం ఫోన్ చేశారు?" కయ్యానికి కాలుదువ్వాను.

"ఏళ్ళు గడిచినా అదే పొగరూ- అదే విగరూ- నువ్వేం మారలేదోయ్".

అటువైపు నుంచి చిన్నగా నవ్విన శబ్దం.

నాకు బిడియంగా అన్పించింది. కాస్త మృదువుగా మాట్లాడి వుండాల్సిందికదా- ఎందుకంత రఫ్‌గా మాట్లాడాను? పైగా ఎవరో తెల్సినవాళ్ళలా, బాగా కావల్సినవాళ్ళలా వున్నారే- ఎవరయ్యుంటారు?

'ఏ-వ-రం-డీ-"

"చెప్పుకోండి చూద్దాం- రచయిత్రి గారూ!"

"బాబోయ్ నేను రచయిత్రిని అనికూడా తెల్సంటే మీరెవరో నాకు బాగా తెల్సినవాళ్ళే అయ్యుండాలి!"

"అవునుకదా!"


నవ్వుతూ అడిగాను "ప్లీజ్ చెప్పండి!"

ఎక్కడో విన్నట్టున్న ఆ గొంతుని పోల్చు కోటాన్కి ప్రయత్నిస్తున్నా!

"నేనూ- నేనూ- నీ రచయిత్రిని!"

"ఓ గ్గాడ్! మీరా?" వుద్వేగంతో నాకు మాటలు కూడా సరిగ్గా రాలేదు. తను నా అభిమాన రచయిత్రి! పదేళ్ళక్రితం- నేను అపుడపుడే రచనలు చేయటం మొదలు పెట్టిన కొత్తల్లో- తను బాగా పాపులర్! తన రచనల్ని బాగా చదువుతుండేదాన్ని! తన పరిచయాన్నీ, స్నేహాన్నీ ఎంతో అపురూపంగా చూసుకునేదాన్ని!

సడెన్‌గా తను వీసా రెక్కలతో అమెరికా వెళ్ళిపోయింది. రచనలూ, స్నేహాలూ మానేసి- అన్నీ నాకొదిలేసి! మళ్ళీ ఎన్నా




ళ్ళకు- ఎన్నాళ్ళకెన్నాళ్ళకు- ఎన్నేళ్ళకు?

"ఎక్కడ్నుంచీ?"

"నక్షత్రలోకం నుంచి-".

"మేడమీదికి ఎక్కి చూడనా?"

అవతలి పక్కనుంచి తను నవ్వుతోంది.

"నిజం చెప్పండీ- ఎక్కడ్నుంచీ?"

తనుంటోన్న ఫైవ్‌స్టార్ హోటల్ పేరు చెప్పింది.

"అయ్యో! హోటల్‌లో వున్నారా?" నొచ్చుకుంటూ అడిగాను.

"అవున్మరి- ఇక్కడయితేనే కంఫర్ట్‌గా వుంటుందనీ" చెప్పింది.

నాకు గుర్తొచ్చింది. వాళ్ళవాళ్ళంతా ఎక్కడో గోదావరి జిల్లాలో వుంటారు. హైదరాబాద్‌లో తన బంధువులెవరూ లేరనుకుంటా-

"ఈరోజు మా ఇంటికి భోజనాన్కి వచ్చేయండి- భోజనాలూ, కబుర్లూ-"

""వద్దొద్దు- అంత శ్రమ పెట్టుకోకు- పైగా టయిమ్‌లేదు- నువ్వే ఈరోజు ఇక్కడికి వచ్చేయ్" చెప్పింది.

"ఈరోజా?"

"అవున్మరి! రేపు బెంగుళూరు వెడ్తున్నాం- తన ఫ్రెండ్స్‌ని కల్సుకోవాలంటున్నారు హబ్బీ! తర్వాత చెన్నయ్- ఆ తర్వాత అమెరికా"

"అయితే ఈరోజే వస్తాను."

"ఈరోజేకాదు- ఇపుడే- వున్న ఫళానా బయల్దేరి వచ్చేయ్- వస్తావా మరి?"

"వస్తానొస్తాను" గబగబ చెప్పాను.

"వెయిట్ చేస్తుంటాన్మరి!"

"బై!" ఫోను క్రెడిల్ చేసాను.

తలతిప్పి చూసేసరికి శ్రీవారు పెసరట్లని దిబ్బరొట్టెలుగా వేస్తున్నారు- ఫోన్ సంభాషణ విన్నట్టున్నారు.

"జరగండి-" అంటూ వంటింట్లోకి పరిగెత్తాను.

ఎంతో వుత్సాహంగా, వుద్వేగంగా వుంది- శ్రీవారికి మొత్తం చెప్పాను ఒక్కసారిగా పదేళ్ళ వయస్సు తగ్గినట్టుంది- ఆ రోజుల్లోకి పెళ్ళి, పిల్లలు, బాధ్యతలు లేని రోజుల్లోకి- వెళ్ళిపోయాను.

దేముడెంత గొప్ప సైంటిస్ట్?

ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్ళిపోగల మనసుని సృష్టించి మనిషికిచ్చేడు.

ఆరోజుల్లో ఎన్ని కబుర్లు చెప్పుకునే వాళ్ళం!

తను నాకంటే పెద్దది! అప్పటికే పెళ్ళయ్యింది. ఒకపాప! భర్త ఇంజనీర్! తను ఇంగ్లీష్ లెక్చరర్!

నేను కెమిస్ట్రీ లెక్చరర్‌ని- ఒకే కాలేజిలో పనిచేస్తూ వుండేవాళ్ళం!

నేను తనకంటే చిన్నదాన్ని- అప్పటికింకా పెళ్ళికాకపోవటం వల్ల కాబోలు నన్ను ఇంకా బాగా చిన్నదానిలాగా ట్రీట్ చేసేది. అభిమానంగా చూసుకునేది.

వాళ్ళాయనకి ఫారిన్ ఛాన్స్ రావటంతో సడెన్‌గా వెళ్ళిపోయింది- వుత్తరాలాగిపోయాయి.

ఎలాగో లింక్ తెగిపోయింది.

అప్పట్లో తను కొత్తగా రాసిన పొయిట్రీ నాకే ముందు చదివి విన్పించేది- ఆర్ద్రతతో నిండిన ఆ కవిత్వపు పరిమళం- నన్ను ఒక పట్టాన వదిలిపెట్టేది కాదు.

"ఏమోయ్- ఏమిటీ ప్రోగ్రామ్"- శ్రీవారు అడుగుతుంటే నేను వాస్తవంలోకి వచ్చాను.

"అన్ని ప్రోగ్రామ్స్ క్యాన్సిల్ చేసేయండి- నేను నా ఫ్రెండ్ దగ్గరికి వెళ్ళిపోతాను"

"అదికాదు- ఆ ఫిష్"

"డీప్ ఫ్రిజ్‌లో పడేయండి"

"భోజనం-"

"మీ ఇష్టం- హోటల్‌లో అయినా తినండి- లేదంటే" చెబ్తూనే వున్నాను. మళ్ళీ ఫోన్ మోగింది.

వెంటనే తీసేను "హలో"

"ఏమిటీ- ఇంకా అక్కడే వున్నావా?"

"ఇదుగో బయల్దేరుతున్నాను"

"ఎంతసేపట్లో వస్తావ్?"

"నలభై-నలభై అయిదు నిముషాల్లో"

"గుడ్! రూమ్ నెంబర్ ట్వంటీ టూ- గుర్తుంచుకో" ఫోను క్రెడిల్ చేసేసి శ్రీవారితో యుద్ధాన్కి దిగేను.

"నేనేదో దేశం విడిచి వెళ్ళిపోతున్నట్టు- నేను లేకపోతే ఇక్కడ పాలనా యంత్రాంగమంతా స్తంభించి పోయేట్టు. నేనే ఇక్కడ ఇంకో ఆపద్ధర్మ గవర్నమెంట్‌ని ఎరేంజ్ చేయాలన్నట్టు- అన్నీ చెత్త సందేహాలడిగి చంపుకుతింటారు- మీరెక్కడికన్నా వెడ్తానంటే నేనిలాగే అడుగుతానా?"

**నేను తనకంటే చిన్నదాన్ని- అప్పటికింకా పెళ్ళికాకపోవటం వల్ల కాబోలు నన్ను ఇంకా బాగా చిన్నదానిలాగా ట్రీట్ చేసేది. అభిమానంగా చూసుకునేది. వాళ్ళాయనకి ఫారిన్ ఛాన్స్ రావటంతో సడెన్‌గా వెళ్ళిపోయింది- వుత్తరాలాగిపోయాయి.**

శ్రీవారు నెమ్మదిగా అడిగేరు.

"పోనీ నేనొచ్చి డ్రాప్ చేయనా?"

"ఏమొద్దు- నేనూ, తనూ ఇద్దరమే కబుర్లు చెప్పుకుంటాం- మీరొస్తే ఇబ్బంది"

"ఎన్ని గంటలకు వస్తావ్?"

"ఎందుకు?"

"చిన్నాన్న వాళ్ళింటికి వస్తామని..."

"ఫోన్ చేసేయండి- రావట్లేదని! లేదంటే పిల్లల్ని తీసుకుని మీరు వెళ్ళండి- నేను రాను..."



హడావిడిగా తయారై బయటపడ్డాను.

ఆటోలో హోటల్‌కి చేరుకున్నాను.

ఆ ఫైవ్‌స్టార్ హోటల్‌కి నేనెపుడూ వెళ్ళలేదు. చాలా రిచ్‌గా వుంది!

రిసెప్షన్ దగ్గరికి వెళ్ళాను. రూమ్‌కి దారి అడిగి వెళ్ళి, కాలింగ్ బెల్ నొక్కేను.

తలుపు తీసే లోపు ఎంత వుద్వేగమో-

తలుపు తెరుచుకుంది-

ఎదురుగా వున్న వ్యక్తిని పోల్చుకోవటాన్కి నాకొంచెం టయిమ్ పట్టింది.

"హాయ్- హౌడుయుడూ?" అంటూ వచ్చి దగ్గరికి తీసుకుంది.

చేతులు పట్టుకుని తీసుకెళ్ళి సోఫాలో కూర్చోపెట్టింది. నేను తననే చూస్తున్నాను.

తను మారిపోయింది-పూర్తిగా- సంపూర్తిగా- తనకు పొడగాటి జడవుండేది- ఇపుడా జుత్తు భుజాల వరకే వుంది- నలుపూ కాదు- తెలుపూకాదు- పురికొస దారాల్లా అదే రంగులో జుట్టంతా వ్రేలాడ్తోంది.

ఇదివరకు రోజుల్లో నిండుగా సినీనటి సావిత్రిలా వుండేది- ఇపుడు ఇంగ్లీష్ పిక్చర్స్‌లో పెద్ద వయస్సు పాత్రల్లో నటించే నటిలా సన్నగావుంది.

ముఖానికి ఖరీదైన మేకప్- కళ్ళకు మస్కారా- జారిన చెంపలకు రూజ్- పెదవులకు లిప్‌స్టిక్- బొట్టులేదు.

మెడలో సన్నటి గొలుసు- డైమండ్స్ వున్న లాకెట్! చెవులకు డైమండ్ స్టడ్స్! వదులొదులుగా వున్న ఫుల్‌హేండ్స్ టీషర్ట్- జీన్స్ ప్యాంట్!

అవసరమైన దానికన్నా ఎక్కువ హావభావాలు ప్రదర్శిస్తూ తను మాట్లాడ్తోంటే నాకు ఇంకా ఎవరో కొత్తవ్యక్తిని చూస్తున్నట్టే వుంది- నేను చూడాలనుకున్న మనిషి- నేను వూహించుకున్న మనిషి- ఈవిడ కాదు!

పదేళ్ళ వయస్సు పెరిగితే ఇంకా జ్ఞానంతో, అనుభవంతో స్త్రీలు మరింత పరిణితి చెందిన ఇంకాఇంకా హుందాగా, గౌరవప్రదంగా కన్పించాలి!

తను ఒకపుడు ఎలావుండేది?

పెద్ద జడతో, కాటన్ చీరల్తో, గుండ్రటి బొట్టుతో- చూడగానే అక్కలాగా- ఆత్మీయురాలిలాగా అన్పించేది

రోమ్‌లో వుంటే రోమన్‌లాగే వుండాలట!

అమెరికాలో వుంటే అమెరికన్‌లాగే వుండాలేమో-

"ఈమధ్య ఏమయినా రాసేరా-" ఎక్కడో ఆశ మిణుక్కుమిణుక్కుమంటూండగా అడిగేను.

"యుమీన్- రైటింగ్?" కుడిచేత్తో సైగ చేస్తూ అడిగింది.

అవునన్నట్టుగా తలూపేను- 'ఆ రచనలేగా మనల్ని దగ్గర చేసిందీ'

"వ్వా- కమాన్- ఇటీజ్ లెబోరియస్ ప్రాసెస్- డేమ్ హెడ్డేక్" ఎక్స్‌ప్రెషన్స్‌తో చెప్పింది.

రెండ్రోజులు అన్నం తినకపోయినా ఫర్లేదు- పొయిట్రీ చదవకుండా వుండలేనో- రాయాలన్న వుద్వేగం వచ్చేస్తే నా చేతి వేళ్ళే పెన్నులైపోతాయ్- అంటూ చెప్పిన ఆవిడా- ఈవిడా ఒక్కరేనా?

"నువ్వింకా రాస్తున్నావా?"

తలూపాను.

"ఏం తీసుకుంటావ్ కూల్‌డ్రింకా? కాఫీ? టీ?" అపుడే గుర్తొచ్చినట్టు అడిగింది.

"టీ-"

ఫోన్‌తీసి రూమ్ సర్వీస్‌కి చెప్పింది.

నేను తననే చూస్తున్నాను. తన ఇంగ్లీష్

యాస అంతా మారిపోయింది. ఇదివరలో కూడా తను (ఇంగ్లీష్ లిటరేచర్ స్టూడెంట్ కాబట్టి) ఇంగ్లీష్ ఎక్కువగానే మాట్లాడేది. కానీ తనిపుడు ఇంగ్లీష్ మాట్లాడ్తోంటే ఏమిటోగా వుంది.

"ఏమిటీ- ఇక్కడి మనుషులింకా ఏమ్మారలేదు- స్టోన్ ఏజ్ మనుషుల్లానే వున్నారు-" చేతులు ఎక్కువగా కదుపుతోంది.

చేతులు కదిలినప్పుడల్లా వేళ్ళకున్న డైమండ్ వుంగరాలు ధమక్‌మని మెరుస్తున్నాయి.

"రాత్రి ఎవరో భోజనానికి పిలిస్తే వెళ్ళామోయ్- బుల్‌షిట్- లేడీస్ ఒకచోట- జెంట్స్ ఒకచోట వాళ్ళకి హాట్‌డ్రింక్స్! ఇక అదేం గెట్ టుగెదరో నాకర్థం కాలేదు. ఆడాళ్ళకి పరదాల్లేవ్- అంతే! గాడ్! ఈ డామినేషనెలా భరిస్తున్నారు?" పెద్దగా నవ్వుతూ అడిగింది.

నేను మాట్లాడలేదు.

"అవునూ! నువ్వెందుకూ అమెరికాకి ట్రై చేయలేదు?"

నవ్వేను-

"ఇక్కడ ఎంత కష్టపడ్డా ఏముందోయ్- అమెరికా అయితే 'ల్యాండ్ ఆఫ్ గోల్డెన్ ఆపర్ట్యునిటీస్' నువ్వు చేస్తానంటే ఇరవైనాలుగ్గంటలూ- మూడొందలా అరవై అయిదురోజులూ పని వుంటుంది. ఇక్కడ పనీ వుండదూ- గుర్తింపూ వుండదు- డబ్బూ వుండదు- యునో అయ్ హేటిట్-"

"మీరక్కడ వర్క్ చేస్తున్నారా?"

"య్యా! కంప్యూటర్ ప్రోగ్రామర్‌గా-"

ఆవిడ కీట్స్ పొయిట్రీ చెబ్తుంటే స్టూడెంట్స్ తాదాత్మ్యంగా వింటూండిపోవటం నాకళ్ళముందు మెదిలింది.

ఏదో దిగులు-

రూమ్‌బోయ్ ట్రేలో ఫ్లాస్క్, కప్పులు తీసుకొచ్చి కప్పుల్లో టీ పోసిచ్చేడు.

టీ తాగుతుండగా అడిగింది-

"నీ మొబైల్ నెంబరెంత?"

"నాకు మొబైల్ లేదు"

"మొబైల్ లేకుండా ఎలా వుంటున్నావ్?"

నవ్వేను.

"ఒకసారి అలాటి ప్రపంచానికి ఎక్స్‌పోజ్‌అయ్యాక ఇక్కడ పొజిషన్ చూస్తుంటే చికాగ్గా వుంటుంది. ఆఫ్టాల్ చిన్న లైసెన్స్ కావాలన్నా ఇక్కడ ప్రోబ్లమ్మే-"

నేను మాట్లాడలేదు.

"అక్కడంతా సెకన్ల మీద జరిగిపోతుంది. వాళ్ళకి టయిమ్ విలువ బాగా తెల్సు- టైమ్ ఈజ్ మనీ అంటారు. ఇక్కడా? హెల్? రోడ్లూ- ట్రాఫిక్ హారిబుల్! ఈడస్ట్- అబ్బబ్బ ఎలర్జీ- నీకు తెల్సా? అక్కడ ఒక్క దోమగానీ- ఈగగానీ వుండవో- దుమ్ముధూళీ వుండదు- ఇదుగో ఈ హోటల్‌లో కారిడార్లు వున్నట్లుగా వుంటాయ్ అక్కడి రోడ్లు!" చెబ్తోంది ఆమె.

నేను వినటం మానేసాను.

తనకేదో ఫోన్ వచ్చింది.

"ఎక్స్‌క్యూజ్‌మి" అంటూ వెళ్ళి ఫోన్ మాట్లాడి వచ్చింది.

"అవునూ- నువ్వెలా వచ్చేవ్?" అడిగింది.

ఏం సమాధానం చెప్పనూ?

"అదేమిటోయ్- ఇంకా ఫోర్ వీలర్ తీసుకోలేదా? ప్చ్! ఇక్కడ ఈ సంపాదనతో ఫోర్ వీలర్ తీసుకోవటం, మెయిన్‌టెయిన్ చేయటం ఎలా వీలవుతుందిలే? అక్కడ ఫోర్‌వీలర్ లేకపోతే క్షణం గడవదు! నాది నాకే- హబ్బీది హబ్బీకే- పింకీ- నా డాటర్- గుర్తుందిగా దాని వెహికిల్ దానికే-"

"ఏమిటీ- పింకీ అపుడే కారు డ్రైవ్ చేసేంత పెద్దదయ్యిందా?"



**ఆవిడ మాటల్లో రెండో అర్థాలు, విపరీతార్థాలు వెతికే ప్రయత్నిమేదీ నేను చేయలేదు. వింటూ, చూస్తూ కూర్చున్నాను. అమెరికా వెళ్ళటం వల్ల తను ఏయే గొప్పగొప్ప సౌఖ్యాలు పొందుతోందో చెప్పటమే తన వుద్దేశ్యం!**

ఆశ్చర్యపోయాన్నేను.

"ఓగ్గాడ్! షి ఈజ్ సో ఇండిపెండెంట్! దాని ప్రపంచమే వేరు! దాని ఫ్రెండ్ సర్కిల్ వేరు! అది దాని కంప్యూటర్- ఛాటింగ్- పార్టీలు- గోలగోల అనుకో- నేను దాని రూమ్‌లోకి వెడ్తే కామ్ అయిపోతుంది. దానికి సంబంధించిన పన్లేవీ నేను చేయటాన్కి వీల్లేదు. అన్నీ అదే చేసుకుంటుంది. మొత్తం అక్కడి కల్చర్‌లోనే పెరిగిందికదా- ఆ బ్రాటప్పే!"

నాకర్థమవుతూనేవుంది- ఆవిడ పెంపకం!

"ఆమధ్య ఇల్లు కట్టుకున్నామోయ్- అదో ఎఛీవ్‌మెంట్ అనుకో! రియల్లీ ఇటీజ్ బ్యూటీఫుల్! స్విమ్మింగ్‌పూల్ వుండాల్సిందేనని పింకీ పట్టుబట్టింది-" నవ్వుతూ చెబ్తోంది.

ఆవిడ అలా మాట్లాడ్తూనే వుంది!

ఆవిడ మాటల్లో రెండో అర్థాలు, విపరీతార్థాలు వెతికే ప్రయుత్నిమేదీ నేను చేయలేదు.

వింటూ, చూస్తూ కూర్చున్నాను.

అమెరికా వెళ్ళటం వల్ల తను ఏయే గొప్పగొప్ప సౌఖ్యాలు పొందుతోందో చెప్పటమే తన వుద్దేశ్యం!

ఈలోగా రూమ్‌బోయ్ వచ్చాడు- బిల్ బుక్‌లో సిగ్నేచర్ కోసమని!

ఆవిడ భుజాలు కుదుపుతూ "పెన్నుందా?" అనడిగింది.

అతను లేదన్నట్టు తలఅడ్డంగా వూపేడు.

ఆవిడ లేచివెళ్ళి తనపర్స్‌లోంచి పెన్ను తీసుకొచ్చి, అతనడిగిన పేపర్ మీద సంతకం చేసిచ్చింది.

ఆ పెన్ను ఖరీదు ఇండియన్ కరెన్సీలో ఇరవైవేల రూపాయలుంటుందంటూ మళ్ళీ మొదలు పెట్టింది.

ఇంకో అరగంట కూర్చున్నాను.

ఇండియాలో బతకటమంటే నరకంలో బతకటమేనన్న ఫీలింగ్ కలిగేలా- ఆవిడ మాట్లాడింది.

ఎంతో నిరుత్సాహంగా అన్పించింది.

అన్ని పన్లూ మానుకుని ఎంత హడావిడిగా వచ్చాను?

దిగులూ- కోపమూ-

నెమ్మదిగా అడిగాను ఒకే ఒక్క ప్రశ్న- చివరి ప్రశ్న- సూటిగా ఆవిడ కళ్ళల్లోకి చూస్తూ అడిగాను.

"ఆర్యూ హేపీ?"

ఆవిడలో సన్నటి కలవరపాటు, ఒక వులికిపాటు!

"హేపీయా అంటే హేపీనే!

అఫ్‌కోర్స్- సమ్ టైమ్స్ అయ్ మిస్‌యు- మిస్ యు ఆల్! ఒక్కో రాత్రి గుర్తొస్తూ వుంటారు- లిటరేచర్- పొయిట్రీ- అన్నీ మిస్సవుతున్నాను అన్పిస్తుంది. మూడీగా అయిపోతాను- తెల్లారిలేస్తే మళ్ళీ మామూలే!"

నేను లేచి నిలబడ్డాను! ఆవిడ నాకర్థమైంది.

ఐడెంటిటీ క్రైసిస్! మనిషి తనను తాను కోల్పోయాక, ప్రపంచాన్ని సాధించినా ఏం ప్రయోజనం?

తన దగ్గర వీడ్కోలు తీసుకున్నాను.

"కిందవరకూ వస్తాను" అంటూ ఆవిడా వచ్చింది.

లిఫ్ట్ ముందాగేం. బటన్ ప్రెస్ చేశాను.

లిఫ్ట్ ఆగింది.

అందులో ఇందాకటి రూమ్‌బోయ్ వున్నాడు. మమ్మల్ని చూసి వినయంగా పక్కకు జరిగాడు.

మేము లిఫ్ట్‌లోకి వెళ్ళగానే తలుపులు మూసుకున్నాయ్.

"ఎక్స్‌క్యూజ్‌మి మేడమ్!" రూమ్‌బోయ్ పిలిచాడు.

ఆవిడ అతనివైపు చూసింది- ఏమిటన్నట్టుగా-

అతను నావైపు చూస్తూ-

"మేడమ్! ఆటోగ్రాఫ్ ప్లీజ్-" అన్నాడు- నా చేతికి పెన్నూ, బుక్కూ అందిస్తూ!

ఆవిడ ముఖం అదోలా అయిపోయింది.

'ఇక్కడ పనీ వుండదు- గుర్తింపూ వుండదూ- ఎందుకుంటున్నావిక్కడ?' అన్న ఆవిడ ప్రశ్నకు సమాధానం చెప్పటానికన్నట్టుగా- నేను ఆ రూమ్‌బోయ్‌కి ఆటోగ్రాఫ్ ఇచ్చాను!

●

## చేయని నేరానికి శిక్ష

నేను ఎనిమిదవ తరగతి చదివే రోజుల్లో ఎక్కువగా క్రికెట్ ఆడేవాడిని. ఒకరోజు మధ్యాహ్నం స్కూల్‌కు సెలవివ్వటంతో నేను నా స్నేహితులు కలిసి మా పాఠశాల ఆవరణలో క్రికెట్ ఆడాం. బాగా అలసిపోయి దాహం వేయడం వల్ల మా స్కూల్‌లోని వాటర్ టాంక్ ఉన్న గదిలోకి వెళ్లి నీళ్లు తాగాం. అది చూసిన మా స్కూల్ అటెండర్ మమ్మల్ని పట్టుకొని మర్నాడు మా హెడ్‌మాస్టర్ దగ్గరికి తీసుకెళ్ళాడు. మేం స్కూల్లోకి వెళ్లి స్టోర్ రూములో దొంగతనం చేశామని అబద్ధం చెప్పాడు. అంతకు ముందే మా స్కూల్లో కొన్ని సామాన్లు పోవడం వల్ల ఆ నేరం మామీద పడింది. ఆ విషయాన్ని అందరూ నమ్మారు. అప్పుడు మా స్కూల్లో సహ విద్యార్థినీ విద్యార్థుల ముందు మోకాళ్ళపై కూర్చుండబెట్టారు. మమ్మల్ని హీనాతిహీనంగా చూశారు. చేయ్యని నేరానికి మేం అనుభవించిన ఆ మనోవేదన వర్ణనాతీతం. ఈ విషయంపై విచారణ చేస్తూ మా స్కూల్ యాజమాన్యం కొన్ని రోజులు క్లాస్ బైట కూర్చోబెట్టారు. టీచర్లు పాఠాలు చెబుతూ ఉండేవారు. కానీ మాకు వినే అవకాశం లేదు. దీంతో మాలో పట్టుదల పెరిగి అటెండరే ఆ దొంగతనం చేసినట్టు సాక్ష్యాలతో సహా నిరూపించాం. అందరిముందు అతన్ని నిలబెట్టి ఆ దొంగతనం మేం చేయలేదని నిరూపించుకున్నాం. మమ్మల్ని అసహ్యించుకున్న అందరూ మమ్మల్ని మెచ్చుకొన్నారు. అదే సంవత్సరంలో ఆగస్టు 15న అందరి సమక్షంలో బహుమతి కూడా ఇచ్చారు. ఈ సంఘటన నా జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేనిది.



షబ్బీర్

-యం.డి.షబ్బీర్,
రుద్రంపూర్, ఖమ్మం జిల్లా

## మెచ్చుకున్న నిజాయితీ

నేను ఓ ఫొటో స్టూడియోలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాను. మా వూర్లో ప్రతి మంగళవారం అంగడి జరు గుతుండేది. ఆ అంగడి జనంతో కిటకిటలాడేది. ఒకసారి ఒకావిడ కూరగాయలు తీసుకోవడానికివచ్చింది. ఆమెదగ్గర ఉన్న మనీపర్సు ఒకడు తీయడానికి ప్రయత్నిస్తున్నాడు. మా షాపునుండి నేను గమనిస్తున్నాను. అతను పర్స్ తీసుకొని పారిపోబోయాడు. వెంటనే నేను వెళ్ళి అతన్ని పట్టుకున్నాను. అతనికి దేహశుద్ధిచేసి ఆ పర్స్ ఆమెకు ఇప్పించాను. ఆమె ఒక ప్రభుత్వ ఉద్యోగిని ఆమె నన్ను మెచ్చుకొని వందరూపాయలు ఇవ్వబోయింది. తీసుకోలేదు. డబ్బుల కన్న విలువైన గౌరవాన్ని అక్కడ పొందాను.



రాజ్ మహ్మద్

- రాజ్ మహ్మద్, నిజామాబాద్ జిల్లా